క్లుప్తంగా

సైన్స్ మెటీరియల్ వితరణ

జూలూరుపాడు: కాకర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.20 వేలు విలువ గల సైన్స్ ల్యాబ్ మెటీరియల్‌ను బుధవారం పూర్వవిద్యార్థులు గుత్తా నవీన్, కూరాకుల హనుమంతరావు అందజేశారు. హెచ్‌ఎం బి.బాలాజీ, ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాసరావు, బి.సంపత్, శ్రీనివాసరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

యూనిఫాం పంపిణీ

సూపర్‌బజార్(కొత్తగూడెం): లక్ష్మీదేవిపల్లి మండలం గట్టుమళ్ల పంచాయతీ గంగమ్మ కాలనీ మినీ అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు బుధవారం హెల్పింగ్ ఫౌండేషన్ (విజయవాడ) ఆధ్వర్యంలో వెంకట్ కుటుంబసభ్యుల సహకారంతో యూనిఫాం అందజేశారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమాధికారి లెనీనా చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీడీపీఓ కనకదుర్గ, సూపర్‌వైజర్ అవోకకుమారి, అంగన్‌వాడీ టీచర్ భద్రమ్మ పాల్గొన్నారు.

వీఆర్‌ఏ కమిటీ ఎన్నిక

జూలూరుపాడు: జూలూరుపాడు మండల వీఆర్‌ఏల సంఘం అధ్యక్షురాలిగా నల్లబండబోడు వీఆర్‌ఏ మందెరకల చిన్న గోపమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక తహసీల్‌లో విధులు నిర్వహిస్తున్న వీఆర్‌ఏలు బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏఆర్‌ఏల మండల కమిటీ ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షుడిగా దూదెకుల సిద్ధా (పాపకొల్లు), కోశాధికారిగా లకావత్ రవి (మాచినేనిపేట), కన్వీనర్‌గా నల్లగట్ల వీరయ్య (గుండెపుడి), కోకన్వీనర్‌గా కృష్ణకుమారి (పాపకొల్లు) ఎన్నికయ్యారు.

చెక్కు అందజేత

కొత్తగూడెంఅర్బన్: పాము కాటుతో మృతి చెందిన రైతు కుటుంబానికి రూ.20 లక్షల ఇన్సూరెన్స్ చెక్కును ఎస్‌బీఐ అధికారులు బుధవారం అందజేశారు. కొత్తగూడెం ఎస్‌బీఐ అధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ.. లక్ష్మీదేవిపల్లి మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన గుగులోత్ నాణ్య (53) 2021లో పొలానికి వెళుతుండగా పాముకాటుకు గురై మృతి చెందాడు. అతనికి బ్యాంకులో రూ.1000 ఇన్సూరెన్స్ బీమా ఉండడంతో మృతుడి కుటుంబానికి రూ.20 లక్షల బీమా చెక్కు అందజేసినట్లు తెలిపారు.

క్రీడా ప్రాంగణ నిర్మాణ పనులు ప్రారంభం

చుంచుపల్లి: బాబూ క్యాంపు పంచాయతీలో నూతనంగా ఏర్పాటు చేయనున్న తెలంగాణ క్రీడా ప్రాంగణం పనులను బుధవారం చుంచుపల్లి ఎంపీపీ బాదావత్ శాంతి ప్రారంభించారు. మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామంలో యువకుల కోసం క్రీడా మైదానాలను ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గుగులోత్ బాబూరావు, ఎంపీడీఓ రమేష్, ఎంపీఓ సత్యనారాయణ, వార్డు సభ్యులు శ్రీనివాస్, సుబ్బారావు, సెక్రటరీ విజయ్, ఉపాధి సిబ్బంది నాగరాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక పురోగతి సాధించాలి

సుజాతనగర్: బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీజీవీబీ మేనేజర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. వేపలగడ్డ గ్రామంలో జయం గ్రామ సమాఖ్య పరిధిలో రూ.1.98 లక్షలతో మంజూరైన బ్రెడ్ తయారీ యూనిట్‌ను బుధవారం ప్రారంభించారు. మాట్లాడుతూ.. బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థిక పురోగతి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎం సునంద, ఏపీఎం మీరాంబి, సీసీ శిరీష, వీఓలు పద్మ, దుర్గ పాల్గొన్నారు.

ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందజేయండి

ఇల్లెందు: ఆదాయ పన్ను కోసం ప్రతి సింగరేణి ఉద్యోగి ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని ఏరియా జీఎం ఎం.షాలేమురాజు కోరారు. బుధవారం ఇల్లెందులో మాట్లాడుతూ.. కార్పొరేట్ కార్యాలయం ఆదేశాల మేరకు 2022–23 ఆర్థిక సంవత్సరానికి ఆదాయ పన్ను కోసం ప్రతిపాదిత పొదుపుకు సంబంధించిన వాస్తవ పత్రాలను పొందిన ఉద్యోగులందరూ గని వద్ద గనీ విభాగాల వద్ద గనీ పత్రాలు సమర్పించాలని కోరారు. ఒకవేళ ఎవరైనా పత్రాలు సమర్పించకపోతే రికార్డులను అప్‌డేట్ చేసుకోవాల్సిందిగా సూచించారు.

ఆర్థిక సాయం

ఇల్లెందురూరల్: లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ అనారోగ్యానికి గురైన యాకూబ్‌కు ఇష్టా అనుబంధ మోటారు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని బుధవారం అందజేశారు. కార్యక్రమంలో మోహన్‌రావు, పల్లి సుధాకర్, నూనేశ్వరరావు, రమేష్, రాజులోథ్, అంజయ్య, కృష్ణ పాల్గొన్నారు.

సత్తా చాటిన 'సాహితి'

ఇల్లెందు: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) దేశవ్యాప్తంగా నిర్వహించిన జేఈఈ మెయిన్ జనవరి–2023లో మారుమూల గిరిజన ప్రాంతానికి చెందిన ఇల్లెందు సాహితి జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. బుధవారం విడుదలైన ఫలితాల వివరాలను కళాశాల డైరెక్టర్ ఎంపీ నాగిరెడ్డి, ప్రిన్సిపాల్ గుజ్జర్లపూడి రాంబాబు వెల్లడించారు. కళాశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ప్రతిభ చాటారని తెలిపారు. బి.ఆర్య 96.21శాతం సాధించినట్లు చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు.

మున్సిపాలిటీకి రూ.100 కోట్లు

- డీఎంఎఫ్ నిధులు రూ.60కోట్లు ఇప్పటికే కలెక్టర్ ఖాతాలో జమ
- త్వరలో మంజూరు కానున్న సీఎం స్పెషల్‌గ్రాంట్ రూ.40కోట్లు



పాల్వంచ పట్టణం

పాల్వంచ: పారిశ్రామిక పట్టణంగా దినదినాభివృద్ధి చెందుతున్న పాల్వంచ మున్సిపాలిటీ అభివృద్ధిలో శరవేగంగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే కలెక్టరేట్ సముదాయాలు కొత్తగూడెం-పాల్వంచ పట్టణ శివారులో నెలకొల్పడంతో రెండు జంట పట్టణాల అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయి. తాజాగా ద్వితీయశ్రేణి మున్సిపాలిటీగా ఉన్న పాల్వంచ పట్టణ అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ప్రత్యేక చొరవతో రూ.100 కోట్ల నిధులు వచ్చాయి. ఈ నిధులతో పట్టణ సుందరీకరణతో పాటు మౌలిక వసతులు కల్పించనున్నారు. ఎంతో కాలంగా ప్రజలు ఎదురు చూస్తున్న బ్రిడ్జిలు, కమ్యూనిటీ హాల్స్, మెయిన్ రోడ్ల లైటింగ్, బీటీ రోడ్లకు మోక్షం లభించనుంది. ఇప్పటికే రూ.5 కోట్లతో కిన్నెరసాని రోడ్డు అంబేడ్కర్ సెంటర్ నుంచి అల్లూరి సెంటర్ వరకు డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మార్చి నుంచి దమ్మపేట సెంటర్ కుంటినాగుల గూడెం వరకు బీటీ రోడ్డు విస్తరణ, సైడ్ లైటింగ్‌లు చేపట్టనున్నారు.

రూ.60 కోట్ల కేటాయింపులు ఇలా

పని వివరణ	పనుల సంఖ్య	అంచనా (రూ.కోట్లల్లో)
1.సీసీ రోడ్లు	148	26.51
2. సీసీ డ్రైన్లు	89	20.55
3.ఐమాస్క్ లైటింగ్	9	0.36
4. మైస్ రోడ్డు లైటింగ్	7	3.21
5. పార్కులు	2	2.60
6.వార్డు ఆఫీసులు, కమ్యూనిటీ హాల్స్	1	1.20
7.బ్రిడ్జిలు	3	1.60
8. బిటీ రోడ్లు	1	0.40
9.టౌన్ హాల్	1	2.00
10. మెటల్ రోడ్లు	6	0.56
11.స్టేడియం వర్క్	1	0.85
12. కల్వర్ట్	1	0.15
మొత్తం పనులు	269	60.00

ఇప్పటికే కలెక్టర్ ఖాతాలో రూ.60కోట్లు జమ..

పాల్వంచ పట్టణ అభివృద్ధికి 'స్టిక్ మినరల్ ఫండ్ కింద రూ.60 కోట్లు కలెక్టర్ ఖాతాలో జమయ్యాయి. ఫిబ్రవరి 15 నాటికి టెండర్లను పిలిచేలా ప్రణాళికలు చేస్తున్నారు. ఈ పనులు కార్యరూపం దాల్చగానే సీఎం హామీ మేరకు స్పెషల్ గ్రాంటు నిధులు రూ.40 కోట్లకు ప్రతిపాదనలు చేయనున్నారు. ఈ పనులన్నీ ఈ ఏడాది డిసెంబర్ నాటికి చేయాల్సి ఉండగా వచ్చే ఆరు నెలల్లోనే పూర్తి చేసేలా అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే వనమా, మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు.

పూర్తి చేయనున్న బ్రిడ్జి నిర్మాణాలు
- కేసీఆర్ నగర్ బ్రిడ్జి
- నక్కల వాగు (అయ్యప్పనగర్) బ్రిడ్జి
- ప్రశాంత్ కాలనీ– వెంగళరావు నగర్ కాలనీ బ్రిడ్జి
- శ్రీనివాస నగర్ కాలనీ(బంజారా కాలనీ) మినీ స్టేడియం పనులు
- ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌజ్ స్థలంలో టౌన్ హాల్ నిర్మాణం
- హర్ష టౌన్ షిప్ పార్క్, 20 పార్కుల అభివృద్ధి

ఐ మాస్క్‌లైటింగ్
- నవభారత్ సెంటర్, పాత పాల్వంచ సెంటర్, దమ్మపేట సెంటర్, అంబేడ్కర్ సెంటర్, నటరాజ్ సెంటర్, అల్లూరి సెంటర్, బస్టాండ్ సెంటర్, కోయలవాటర్ ప్లాంట్ సెంటర్, ఇందిరా నగర్ కాలనీ సెంటర్

మెయిన్ రోడ్డు లైటింగ్
- పాత పాల్వంచ నుంచి బీఈడీ కళాశాల వరకు
- ఇందిరా కాలనీ నుంచి జయమ్మ కాలనీ వరకు
- అల్లూరిసెంటర్ నుంచి కరకవాగు వరకు
- దమ్మపేట సెంటర్ నుంచి శ్రీనివాస కాలనీ వరకు
- బస్టాండ్ సెంటర్ నుంచి భజన మందిర్ వరకు
- నటరాజ్ సెంటర్ నుంచి మార్కెట్ ఏరియా వరకు
- ప్రభుత్వ ఆస్పత్రి నుంచి కేఎస్పీ రోడ్డు వరకు

వార్డ్ ఆఫీసులు, కమ్యూనిటీ హాల్స్
- గట్టాయిగూడెం, ఇందిరా కాలనీలు, పాత పాల్వంచ, గడియకట్ట, నవభారత్, శేఖరంబంజర

పట్టణాభివృద్ధికి కృషి..



సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పనులకు మోక్షం కల్పించడం జరుగుతుంది. ప్రజల ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే నా ధ్యేయం. పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దనున్నాం. ఇప్పటికే కేఎస్పీ రోడ్ల విస్తరణతో పట్టణానికి కళ వచ్చింది.
– వనమా వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యే, కొత్తగూడెం

ప్రజల సూచనలు తీసుకున్నాం



ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తులను సైతం పరిగణలోకి తీసుకుని అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు తయారు చేశాం. ఫిబ్రవరిలో టెండర్లు పూర్తిచేసి పనులు ప్రారంభించడం జరుగుతుంది. వచ్చే 6 నెలల్లోనే పనులన్నీ పూర్తి చేయాలని ఎమ్మెల్యే వనమా ఆదేశించారు.
– సీహెచ్.శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్, పాల్వంచ

గ్రంథాలయాల అభివృద్ధిపై సమీక్ష


మాట్లాడుతున్న దిండిగల రాజేందర్

కొత్తగూడెంఅర్బన్: కలెక్టర్ కేటాంచిన నిధులతో నూతన జిల్లా కేంద్ర గ్రంథాలయ భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని గ్రంథాలయ సంస్థ చైర్మన్ దింగిగల రాజేందర్ అన్నారు. బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశం దిండిగల రాజేందర్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో గ్రంథాలయ సంస్థ 2023–24 సంవత్సర బడ్జెట్‌ను ఆమోదించారు. గ్రంథాలయాల అభివృద్ధికి పలు అంశాలను చర్చించారు. రాబోయో ఆర్థిక సంవత్సరములో సొంత భవనాలు లేని గ్రంథాలయాలకు కొత్త భవనాలు నిర్మించేందుకు ప్రతిపాదనలను పరిశీలించారు. సమావేశంలో డీపీఆర్‌ఓ శ్రీనివాసరావు, వివిధ శాఖల నుంచి అధికారులు పుల్లయ్య, వసంతలక్ష్మి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ హయాంలోనే దేశాభివృద్ధి


కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎడవల్లి కృష్ణ

పాల్వంచ: కాంగ్రెస్ పార్టీ హయాంలోనే దేశాభివృద్ధి జరిగిందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో పేదలకు అన్యాయం చేస్తున్నారని టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ అన్నారు. హాత్ సే హాత్ జోడో యాత్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక వెంగళరావు కాలనీలో గడగడపకు వెళ్లి కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఎడవల్లి కృష్ణ మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 3,500 కిలోమీటర్ల మేర భారత్ జోడో యాత్ర నిర్వహించినట్లు చెప్పారు. తెలంగాణ వస్తే ప్రజల జీవన స్థితిగతులు మారుతాయనుకుంటే కేసీఆర్ కుటుంబం మాత్రమే బాగుపడిందన్నారు. డబల్ బెడ్ రూం ఇళ్లు, నిరుద్యోగ భృతి, ఉద్యోగాల కల్పన, పంటలకు బీమా, గిట్టుబాటు ధర, పెన్షన్లు రాలేదన్నారు. దళితబంధు దళారుల బంధుగా మారిందని, ఇప్పటికైనా ప్రజలకు మేలు చేసే కాంగ్రెస్ పార్టీని ఆదరించి, అధికారంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో నూకల రంగారావు, మనోహర్, వీరయ్య చౌదరి, బద్ది కిషోర్, వానపాకుల రాంబాబు, వెంకన్న గౌడ్, రాము నాయక్, శెట్టిపల్లి వెంకట్, చంద్రగిరి సత్యనారాయణ, బత్తుల వెంకటేశ్వరరావు, బాలు నాయక్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుకు ప్రోత్సాహం


మాట్లాడుతున్న ఏడీఏ వాసవీరాణి

టేకులపల్లి: సంప్రదాయ పంటలతో పోలిస్తే ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు ఉంటాయని ఇల్లెందు ఏడీఏ పి.వాసవీరాణి తెలిపారు. మండలంలోని మొక్కంపాడులో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. నూనె కొరతను తగ్గించేందుకు ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న రైతులు ముందుకొస్తే మొక్కలు, డ్రిప్ పరికరాలను సబ్సిడీపై ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే, నాలుగేళ్ల పాటు సాగుకు ప్రోత్సాహక నగదు అందుతుందని చెప్పారు. ఏఓ నీరుడు అన్నపూర్ణ, సర్పంచ్ బానోతు విజయతో పాటు కంపెనీల ప్రతినిధులు, అధికారులు ప్రసాదరావు, రాము, భిక్షంరెడ్డి, రమేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌ఎంఎస్ పోర్టల్ అమలుపై సమీక్ష


మాట్లాడుతున్న సింగరేణి డైరెక్టర్(పా) బలరామ్

సింగరేణి(కొత్తగూడెం): ఎస్‌హెచ్‌ఎంఎస్ పోర్టల్ అమలుపై సింగరేణి డైరెక్టర్(పా) ఎన్.బలరామ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. బుధవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఐటి శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన సింగరేణి హాస్పిటల్ మేనేజ్‌మెంట్ అమలు, పనితీరుపై మెడికల్, పర్సనల్, ఫైనాన్స్, సేఫ్టీ, ఐటీ శాఖల అధికారులతో డైరెక్టర్(పా) సందర్శించారు. అనంతరం పోర్టల్ అమలు పనితీరుపై చర్చించారు. ఈ సందర్భంగా డైరెక్టర్(పా) మాట్లాడుతూ.. మొదటి దశ అమలులో భాగంగా అవుట్ పేషంట్, ఇన్ పేషంట్ రిజిష్టర్లు, ల్యాబ్ రిపోర్టులు, పీఎంఈ, డైట్ డిస్ట్రిబ్యూషన్, వార్డ్ మేనేజ్‌మెంట్ వంటి ముఖ్యమైన వైద్యసేవలకు విస్తరించటం జరిగిందన్నారు. రెండోదశలో ఐఎంఈ దీర్ఘకాలిక వ్యాధులు, ఓటీ సర్వీసు, ఉద్యోగి, కుటుంబసభ్యుల ఫొటో ఆధార్ లింకేజీ, రిఫరల్ విస్తరించటానికి చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

కార్యక్రమంలో సీఎంఓ బీవీ రావు, జీఎం సేఫ్టీ గురవయ్య, జీఎం పర్సనల్ వెల్ఫేర్ అండ్ ఆర్సీ కే.బసవయ్య, జీఎం పర్సనల్ (ఐఆర్‌పీఎం) ఏ.ఆనందరావు, జీఎం ఎంఎస్ సురేష్‌బాబు, జీఎం ఫైనాన్స్ సుబ్బారావు, డీజీఎం పర్సనల్ కే.శ్రీనివాస్‌రావు, డీజీఎం (ఐటీ) హరిశంకర్‌రావు, డాక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'పోలీసులు కఠినంగా వ్యవహరించాలి'


డీఎస్పీని సన్మానిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): ఇటీవల జరిగిన పరిణామాలను దృష్టిలో ఉంచుకొని, శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా పోలీసు శాఖ కఠినంగా వ్యవహరించాలని, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్‌కు కోరారు. కొత్తగూడెం సబ్‌డివిజనల్ అధికారిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా డీఎస్పీని బుధవారం సీపీఐ నేతల బృందం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో ఘనంగా సన్మానించారు. పాషా మాట్లాడుతూ.. అసాంఘిక కార్యకలాపాల నియంత్రణలో పోలీసు శాఖకు పూర్తిగా సహకరిస్తామని, ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజలకు మరింత నమ్మకాన్ని కలిగించాలని కోరారు. బందెల నర్సయ్య, దుర్గరాసి వెంకటేశ్వర్లు, వై.శ్రీనివాస్‌రెడ్డి, సలిగంటి శ్రీనివాస్, నయీమ్ ఖురేషి, వాసిరెడ్డి మురళి, మునిగడప వెంకటేశ్వర్లు, గెద్దాడు నగేష్, భూక్యా శ్రీనివాస్, మాచర్ల శ్రీనివాస్, విజయ్‌కుమార్, సత్యనారాయణచారి, దినేష్, మధు పాల్గొన్నారు.

ప్రభుత్వం స్పందించే వరకు విశ్రమించం..

ఇల్లెందురూరల్: కొమరారంను మండల కేంద్రంగా ప్రభుత్వం ప్రకటించే వరకు విశ్రమించబోమని కొమరారం సర్పంచ్ నాళి కృష్ణవేణి, ఎంపీటీసీ ఆజ్మీర బిచ్చా అన్నారు. కొమరారం గ్రామంలో ప్రజాపంథా ఆధ్వర్యంలో కొమరారంను మండల కేంద్రంగా ప్రకటించాలనే డిమాండ్‌తో చేపట్టిన రిలే నిరాహార దీక్ష బుధవారం తొమ్మిదో రోజుకు చేరుకుంది. మాట్లాడుతూ.. మండలం ఏర్పాటుకు అవసరమైన వసతులు, సౌకర్యాలు ఉన్నప్పటికీ ప్రభుత్వం కావాలనే నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ప్రజల ఆకాంక్షను గమనంలోకి తీసుకొని సత్వరమే ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెల్లడించేలా అధికార పక్షం ప్రజాప్రతినిధులు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఇస్లావత్ కోటేష్, ధరావత్ రామారావు, రమేష్, సునీత, సుమిత్ర, భద్రు, విజయ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి అరకొర నిధులేనా?


జూలూరుపాడులో చంద్రుగొండ క్రాస్ రోడ్ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు

జూలూరుపాడు: విద్యారంగానికి నిధులు కేటాయించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి పవన్ కుమార్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగానికి అరకొర నిధులు కేటాయించడాన్ని నిరసిస్తూ బుధవారం ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులతో జూలూరుపాడులో భారీ ర్యాలీ నిర్వహించి, బడ్జెట్ ప్రతులను తగలబెట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పవన్ కుమార్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు మేలు చేసేందుకే బడ్జెట్‌లో విద్యారంగానికి సరిపడా నిధులు కేటాయించలేదన్నారు. భవిష్యత్‌లో ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసేందుకే తక్కువ నిధులు కేటాయించినట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి 2.57 శాతం కేటాయించగా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి 6.57 శాతం మాత్రమే కేటాయించిందన్నారు. గతంలో రూ.3,556 కోట్లు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంటు విడుదల చేయలేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని, లేదంటే ఆందోళనా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బోడా అభిమిత్ర, పవన్, వెంకటేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి తరానికి ఆదర్శం 'మంచికంటి'

సింగరేణి(కొత్తగూడెం): నేటి తరం యువత, రాజకీయ నాయకులకు మంచికంటి రాంకిషన్‌రావు ఆదర్శనీయమని సీపీఎం నాయకుడు కాసాని ఐలయ్య అన్నారు. కొత్తగూడెంలో బుధవారం నిర్వహించిన మంచికంటి వర్ధంతి సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాటంలో కీలకంగా వ్యవహరించిన ఆయన, రెండుసార్లు ఖమ్మం ఎమ్మెల్యేగా ప్రజారంజక పాలన అందించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో లిక్కి బాలరాజు, అన్నవరం సత్యనారాయణ, కొండపల్లి శ్రీధర్, భూక్యా రమేష్, నాగేశ్వరరావు, వీరభద్రం, వీరన్న, సందకూరి లక్ష్మి, రాంచరణ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ కుటుంబాన్ని ఆదుకోవాలి

సుజాతనగర్: జర్నలిస్టుగా పనిచేస్తూ మృతి చెందిన సూర్యం కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి భూక్యా దస్రు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. సూర్యం మృతితో ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయిందన్నారు. మృతుని కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, డబుల్ బెడ్ రూం ఇల్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో కొమారి హనుమంతరావు, జక్కుల రాములు, వేల్పుల భాస్కర్, భూక్యా కృష్ణ, ప్రభాకర్, హరినాథం, నరేష్ సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు బోరుమోటారు ఏర్పాటు

ఇల్లెందురూరల్: బాలాజీనగర్ గ్రామపంచాయతీ సంజయ్‌నగర్‌లో నీటి ఎద్దడి తీవ్రతను ఇటీవల పంచాయతీలో పర్యటించిన సమయంలో స్థానిక మహిళలు జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. తక్షణం బోరుకు మోటారు బిగించాలని కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామపంచాయతీ పాలకవర్గం తీర్మానం మేరకు పంచాయతీ నిధులతో బోరుకు మోటారును కొనుగోలు చేసి బుధవారం బిగించారు. సర్పంచ్ పాయం స్వాతి మాట్లాడుతూ.. జిల్లా పరిషత్ నిధులతో బోరు వేయడం జరిగిందని, కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామపంచాయతీ నిధులతో బోరుకు మోటారు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రమోద్‌కుమార్, ఉపసర్పంచ్ యాకూబీ పాల్గొన్నారు.

'పొదుపు'పై పీఓడబ్ల్యూ సర్వే

ఇల్లెందురూరల్: మండలంలోని ముత్తారపుకట్ట, వీరాపురం గ్రామాలలో పీఓడబ్ల్యూ నాయకులు బుధవారం పర్యటించారు. పొదుపు సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పావలా వడ్డీ, అభయహస్తం రుణాల అమలు తీరుపై మహిళల నుంచి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో నాయకులు యదళ్లపల్లి సావిత్రి, సులోచన, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలు పరిష్కరించండి


సమస్యలు తెలుసుకుంటున్న గుమ్మడి నర్సయ్య

సూపర్‌బజార్(కొత్తగూడెం): లక్ష్మీదేవిపల్లి మండలం పాతబంగారు చెలక పంచాయతీలో బుధవారం మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య పర్యటించారు. ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాట్లాడుతూ.. ఆర్లగండి గ్రామం నుంచి లక్ష్మీపురం చింతపింకిగూడెం మీదుగా గొల్లగూడెం వరకు బీటీ రోడ్డు మంజూరై నాలుగేళ్లు అవుతున్నా కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యం కారణంగా రోడ్డు నిర్మాణం జరగడంలేదని విమర్శించారు. సమస్యను స్థానికులు పలుమార్లు అధికారుల, స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే నిర్మాణ పనులు ప్రారంభించకపోతే ఆందోళనా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అదేవిధంగా ఈ ప్రాంతంలో వందలాది పేదగిరిజన రైతులు 381 సర్వే నంబరు భూమిని సాగుచేస్తూ జీవిస్తున్నారని వారికి పట్టాలు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జాటోత్ కృష్ణ, జిల్లా నాయకులు ఆజాద్, బాడిస పాపారావు, ప్రసాద్, గ్రామ ఉపసర్పంచ్ మోహనరావు, సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

కొత్తగూడెంఅర్బన్: యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేసి బడ్జెట్లో రూ.1000 కోట్ల నిధులు కేటాయించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు బసనబోయిన వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్ బుధవారం అసెంబ్లీ ముట్టడికి పిలుపు ఇవ్వడంతో కొత్తగూడెంలో పోలీసులు సంఘం నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి, త్రీటౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడారు. అరెస్టు చేసిన వారిలో అంబుల వేణుగోపాల్ యాదవ్, బోయిన విజయ్, స్టాలిన్ యాదవ్, కలకుంట్ల కృష్ణలున్నారు.

ఇల్లెందురూరల్: యాదవ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం నిర్వహిస్తున్న చలో అసెంబ్లీ కార్యక్రమానికి యాదవులు వెళ్లకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. మండల, పట్టణంలోని యాదవ సంఘం నాయకులను బుధవారం రాత్రి ఇల్లెందు పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టైన వారిలో మేకల మల్లేష్ , కరెంటు శ్రీనివాస్, బయ్య వరప్రసాద్, పెరుగు కోటేశ్వరరావు, కాసాని హరిప్రసాద్, సింగం వీరన్న తదితరులు ఉన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం కమిటీ ఎన్నిక


నూతన కమిటీ సభ్యులు

టేకులపల్లి: వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ మేరకు బుధవారం టేకులపల్లిలోని శ్రీభవానీ శంకర సహిత, శ్రీగోవిందమాంబ సమేత శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో కమిటీ చైర్మన్ తాడోజు భిక్షమయ్య అధ్యక్షతన విశ్వబ్రాహ్మణుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలు చర్చించారు. అనంతరం నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా ధర్మపురి శ్రీనివాసచారి, ప్రధాన కార్యదర్శిగా నోముల భాస్కరాచారి, కోశాధికారిగా చంద్రగిరి రాధాకృష్ణ, ఉపాధ్యక్షుడిగా బొడ్డుపల్లి బ్రహ్మచారి, అనంతోజు చంద్రాచారి, కటుకోజ్వల సురేష్, తాడోజు తిరుపతి, ప్రచార కార్యదర్శులుగా వజ్రాల పరిపూర్ణాచారి, పర్వతం ఉపేంద్రచారి, సహాయ కార్యదర్శులుగా పంతంగి శ్రీనివాస్, తాడోజు సందీప్, గజ్జల రామమోహన్ చారి, ఉరిమెళ్ల భరత్‌కృష్ణ, గన్నవరపు అరవింద్, వెనగంటి రవీంద్రాచారి, సలహాదారులుగా ఉరిమెళ్ల యాదాచారి, గుంతోజు కృష్ణ, నోముల భానుచందర్, ధర్మపురి రవికుమార్, కార్యవర్గ సభ్యులుగా అక్కెనపల్లి యాకంబ్రాచారి, జూకంటి సందీప్, తాడోజు గోకుల్, మోత్కూరి రామాచారి, తాడోజు మణికంఠలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని నూతన కమిటీ కార్యవర్గం, సభ్యులు తెలిపారు.



అటెన్షన్ ప్లీజ్

మొక్కల సంరక్షణ ఏదీ..?

మండల కేంద్రం జూలూరుపాడులో మొక్కలకు సంరక్షణ కరువైంది. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి సాయిబాబా ఆలయం వరకు సుమారు 2 కిలోమీటర్ల మేర డివైడర్‌పై నాటిన మొక్కలకు సంరక్షణ లేకపోవడంతో ఎండిపోతున్నాయి. నాలుగేళ్లుగా మొక్కలు నాటడం, ఎండిపోవడం జరుగుతోంది. ఈ నాలుగేళ్లలో మొక్కల పేరు మీద వేలాది రూపాయలు ఖర్చు చేశారు. ప్రజాధనం వృథా అవుతోందని ఇప్పటికైనా సంబంధిత అధికారులు, గ్రామపాలకులు స్పందించి


మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. – జూలూరుపాడు

ప్రశ్నించాల్సిన అధికారి : డి.రామారావు, ఎంపీఓ, జూలూరుపాడు
సెల్ నంబర్ : 9848657608